నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, ఆదివారం 25 ఆగస్టు 2024 | SURYAPET

చౌటపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలో మంత్రి ఉత్తమ్

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి, ఆగస్టు 24 : అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, మాఫీ కాని రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో రూ.50లక్షలతో నిర్మించనున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ రాజగోపుర నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నుంచి తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం అందిస్తామన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బీజేపీకి ఆదరణ తగ్గుతున్నదని, సీబీఐ, ఈడీలను పంపించి ఇతర పార్టీల నేతలను బెదిరింపులకు పాల్పడుతున్నదని విమర్శించారు. హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లి వరకు రూ.80కోట్లతో జాతీయ రహదారితో సమానంగా రోడ్డు వెడల్పు చేపడుతున్నామన్నారు. చౌటపల్లి నుంచి మేళ్లచెర్వు వరకు రూ.10కోట్లతో, మఠంపల్లి నుంచి జాన్‌పహాడ్ వరకు రూ.10కోట్లతో రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎత్తిపోతల పథకాలన్నింటినీ అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం రఘునాథపాలెంలో రూ.38లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ గోదామును ప్రారంభించారు. ఆయన వెంట దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుహాసిని, ఆర్డీఓ శ్రీనివాసులు, తాసీల్దార్ మంగారాథోడ్, ఈఓ లక్ష్మణ్‌రావు, వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ సింగారపు అరుణాసైదులు, మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి అప్పయ్యనాయుడు, నాయకులు సాముల శివారెడ్డి, మంజూనాయక్, కిశోర్‌రెడ్డి, రాంరెడ్డి, లక్ష్మయ్య, రవీందర్‌రెడ్డి, కొండారెడ్డి, భద్రారెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పొన్నం, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు స్వీకరిస్తున్న వీవీ రెడ్డి

దేవరకొండ ఆర్టీసీ డ్రైవర్లకు ఉత్తమ అవార్డులు

దేవరకొండ రూరల్, ఆగస్టు 24 : ప్రతి సంవత్సరం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉద్యోగులకు అందించే ప్రగతి చక్రం పురస్కారాల్లో భాగంగా దేవరకొండ డిపోకు రెండు అవార్డులు వచ్చాయి. డిపోకు చెందిన డ్రైవర్ వడ్డపల్లి వెంకట్‌రెడ్డి, అద్దె బస్సు డ్రైవరు నెహ్రూకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ శుక్రవారం హైదరాబాద్‌లో అవార్డుతోపాటు రూ.51వేల నగదు, ప్రశంసా పత్రం అందజేశారు.

ప్రయాణికులతో మర్యాదగా మెలుగుతూ వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గానూ వారికి ఈ అవార్డులు దక్కాయి. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు డిపో మేనేజర్ రమేశ్‌బాబు, తోటి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించకుంటే చర్యలు తప్పవు

- ఎస్టీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్



గురుకుల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్టీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్

మిర్యాలగూడ, ఆగస్టు 24 : గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు తప్పవని ఎస్టీ వెల్ఫేర్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్ హెచ్చరించారు. మండలంలోని అవంతీపురం గిరిజన గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయు లు హాజరు కాకపోవడం, రికార్డ్ మెయింటెనెన్స్ సరిగా చేయకపోవడంతో ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డైనింగ్ హాల్‌ను చూసి అసహనానికి గురయ్యారు. విద్యార్థులకు మెనూ పాటించకుండా నాసిరకం భోజనం అందిస్తుండడం పట్ల సిబ్బందిని మందలించారు. విద్యార్థులకు తప్పనిసరిగా తాజా కూరగాయలతో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. నాసిరకం కూరగాయలు పంపిణీ చేస్తున్న విషయంపై జేసీకి రిపోర్ట్ చేయాలన్నారు. ఇలాంటివి మళ్లీ పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్‌సీఓ అగస్టీన్ ఉన్నారు.

సామూహిక సెలవులో ఎంసీహెచ్ డాక్టర్లు

- కలెక్టర్ హామీతో వెనక్కి తీసుకున్న వైద్యులు.
- షోకాజ్ నోటీసులు నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశాలు

నీలగిరి, ఆగస్టు 24 : నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఎంసీహెచ్ విభాగంలోని గైనకాలజిస్ట్‌లు శనివారం సామూహికంగా సెలవు పెట్టారు. శుక్రవారం తెల్లవారుజామున కుర్చీలో గర్భిణి డెలివరీ అయిన ఘటనకు సంబంధించి డాక్టర్లు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ అయిన విషయం తెలిసిందే. తమకు సంబంధం లేకున్నా బాధ్యులను చేయడం బాధాకరమంటూ ఎంసీహెచ్‌లోని డాక్టర్లు, సిబ్బంది సామూహిక సెలవు పెట్టారు. పని ఒత్తిడితోపాటు వేధింపులు, సంబంధంలేని ఘటనలకు బాధ్యులను చేస్తూ షోకాజ్ నోటీసులు ఇస్తున్న పరిస్థితుల్లో పని చేయలేమని సెలవు పత్రాలను గైనకాలజీ హెచ్‌ఓడీ స్వరూపారాణికి అందజేశారు. ఆమె ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ నారాయణరెడ్డి రోగులకు ఇబ్బందులు కలుగవద్దని విధులకు హాజరు కావాలని సూచించారు. అయినా.. డాక్టర్లు ఒప్పుకోకపోవడంతో షోకాజ్ నోటీసులను నిలిపివేస్తామని, సోమవారం ఆసుపత్రికి వచ్చి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దాంతో డాక్టర్లు సెలవులను వెనక్కి తీసుకొని విధుల్లో చేరారు. అనంతరం వారికి మద్దతుగా మిగతా విభాగాల వైద్యులు, సిబ్బంది సూపరింటెండెంట్ డాక్టర్ రమణమూర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు.

రుణమాఫీ గ్రీవెన్స్‌కు రైతుల క్యూ

మాఫీకాని రైతుల ప్రదక్షిణలు

- వ్యవసాయశాఖ ఆఫీసుల్లో దరఖాస్తులతో బారులు
- నల్లగొండ జిల్లాలో 6 వేలకు పైగా అర్జీలు
- మండలాల్లో ఏఈఓలకు అందజేత
- లోన్ అకౌంట్ స్టేట్‌మెంట్ కోసం బ్యాంకుల్లో నిరీక్షణ
- సర్కారు తీరుపై అన్నదాతల ఆగ్రహం
- వ్యవసాయ పనుల సీజన్‌లో ఇలా తిప్పడం న్యాయమేనా అని ఆవేదన

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయ రుణాలకు సంబంధించిన 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీల మీద కొర్రీలు పెట్టడంతో అర్హుల్లో సగం మంది రుణమాఫీకి దూరమైన విషయం తెలిసిందే. ఎన్నికల ముందు కాంగ్రెస్ పెద్దలు ఇచ్చిన హామీ ప్రకారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 6లక్షల మంది రుణమాఫీకి అర్హులుగా రైతులు ఉంటారన్నది అంచనా. కానీ రేషన్‌కార్డు ప్రమాణికంగా కుటుంబానికి గరిష్టంగా 2లక్షల రుణమాఫీని వర్తింప చేయడం వల్ల చాలా మందికి మాఫీ కాలేదు. ప్రభుత్వం లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 3.39లక్షల మంది రైతులకే రుణమాఫీ అయ్యింది. దాంతో మరో రెండున్నర లక్షల మందికి పైగా రైతులు రుణమాఫీ కాక తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వారంతా తమకు రుణమాఫీ ఎందుకు కాలేదంటూ వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ రోజూ ప్రదక్షిణ చేస్తున్నారు. కాగా, రుణమాఫీ తొలిదశలోనే సగం మంది రైతులకు మాఫీ జరుగలేదన్న విమర్శల నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత దశల వారీగా మండల వ్యవసాయ శాఖ కార్యాలయాల్లోనూ గ్రీవెన్స్ సెల్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. అన్నిచోట్లా ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆధార్ నెంబర్ ఆధారంగా కొందరికి ఎందుకు రుణమాఫీ కాలేదో అధికారులు తెలియజేస్తున్నా... తదుపరి ఏం చేయాలనే దానిపై మాత్రం స్పష్టత కరువైంది. ఇప్పటివరకు ఒక్క నల్లగొండ జిల్లాలోనే ఆరు వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెప్తున్నారు.

నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ఖాతాలను చెక్ చేసుకుంటున్న రైతులు

మాఫీ కోసం రైతుల ప్రదక్షిణలు

రుణమాఫీ కొర్రీలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతుండడంతోపాటు రైతులు రోడ్లెక్కుతుండడంతో ప్రభుత్వం నష్ట నివారణ చర్యలకు ఆదేశించింది. రుణమాఫీ కాని రైతులు స్థానిక వ్యవసాయ అధికారులను కలిసి మరోసారి తమ ధ్రువీకరణ పత్రాలు అందించాలని సూచించింది. దాంతో రుణమాఫీకి దూరమైన రైతులంతా వారం నుంచి అదే పనిలో ఉన్నారు. రెండు లక్షలకుపైగా రుణం ఉన్న రైతులు మరోసారి తమ పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు లోన్ అకౌంట్ తాజా స్టేట్‌మెంట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిర్సాక్స్‌తోపాటు ఒక దరఖాస్తు ఫారమ్‌ను నింపి మండలాల్లోని ఏఈఓలకు అందిస్తున్నారు. లోన్ స్టేట్‌మెంట్ కోసం ముందుగా బ్యాంకుల చుట్టూ తిరుగాల్సి వస్తున్నది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆత్మకూర్.ఎం వంటి చోట్ల బ్యాంకర్లు రైతులకు టోకెన్లు ఇచ్చి రోజుకు 30 నుంచి 40 మందికి మాత్రమే అవకాశం ఇస్తున్నారు. ఆ తర్వాత సంబంధిత నమూనాలో దరఖాస్తులు అందజేస్తున్నా ప్రభుత్వ తదుపరి ఉత్తర్వుల ప్రకారమే రుణమాఫీ జరుగుతుందని అధికారులు చెప్తుండడం గమనార్హం. రేషన్‌కార్డు లేక రుణమాఫీకి దూరంగా ఉన్న రైతులు కూడా ఇదే తరహాలో తమకు రేషన్‌కార్డు లేదన్న విషయాన్ని తెలియజేస్తూ దరఖాస్తులు సమర్పిస్తున్నారు. దాంతోపాటు ఒకే రేషన్ కార్డులో ఉన్న వారి కుటుంబాల్లోనూ రూ.2లక్షలకు పైగా లోన్ ఉంటే వారికి రుణమాఫీ కాలేదు. వారితోపాటు ఆధార్ నెంబర్‌లో లేదా బ్యాంకు అకౌంట్ నెంబర్‌లో తప్పు ఎంట్రీ ఉన్న వారికి రుణమాఫీ కాలేదు. ఇలాంటి అనేక కారణాలతో రుణమాఫీకి దూరంగా ఉన్న రైతులంతా ప్రస్తుతం అధికారులు, బ్యాంకుల చుట్టూ చక్కర్లు కొట్టాల్సి వస్తున్నది. శనివారం నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం వద్ద గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన రైతులు భేషరతుగా అందరికీ రుణమాఫీ చేయాలని నినాదాలు చేశారు.

వినతుల వెల్లువ

ఒక్క నల్లగొండ జిల్లాలోనే శనివారం నాటికి 6వేలకు పైగా రుణమాఫీ కోసం రైతుల నుంచి వినతులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. శుక్రవారం నాటికి 5,840 దరఖాస్తులు రాగా, శనివారం నాటి వివరాలు అప్‌డేట్ కావాల్సి ఉందన్నారు. అందులో కుటుంబ సభ్యుల వివరాలకు సంబంధించిన దరఖాస్తులు 1,821, రూ.2లక్షలకు పైగా రుణం ఉన్న వాటిపై 745, నో డేటా అని చూపిన ఖాతాలపై 1,554, ఆధార్ నెంబర్ తప్పుగా ఉన్న ఖాతాలపై 234, పేర్లు సరిపోలని వాటిపై 429, బ్యాంకు వివరాలపై 37, సహకార సంఘాల్లోని వాటిపై 105, పాస్‌పుస్తకాలకు సంబంధించి 467, డెబిట్ సమస్యలపై 154, ఇతర కారణాల మీద 294 దరఖాస్తులు శుక్రవారం నాటికి వ్యవసాయ శాఖకు అందాయి. వీటన్నింటినీ స్క్రూటినీ చేస్తూ తప్పొప్పులను సరిచేసి ఆ వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు వెల్లడించారు. ఇవన్నీ ఎలా ఉన్నా గతంలో కేసీఆర్ సర్కారు మాదిరిగా భేషరతుగా రుణమాఫీని వర్తింప చేస్తే ఈ అవస్థలు ఉండవు కదా అని రైతులు మండిపడుతున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో తమను ఇలా బ్యాంకుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిప్పడం న్యాయమేనా అని ప్రశ్నిస్తున్నారు.

నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రుణమాఫీ కాని రైతులు

ఇచ్చిన మాట నిలబెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మీద లేదు. రుణమాఫీ అందరికీ అన్నారు. నాకు మాఫీ కాలేదు. నాకు 38 గుంటల భూమి ఉంది. దాని మీద రూ.52 వేలు పంట రుణం తీసుకున్న. మొదటి విడుత లక్ష లోపు జాబితాలోనే నాకు మాఫీ కావాలి. కాకపోవడంతో బ్యాంకు వెళ్లి అడిగితే రెండో విడుతలో అవుతుందన్నారు. తర్వాత మూడో విడుత అన్నారు. ఏ విడుతలోనూ మాఫీ కాలేదు. పట్టుబట్టి బ్యాంకులో గట్టిగా అడిగితే ఆధార్‌లోని పేరు, ఖాతాలోని పేరు వేరుగా ఉందని. అందుకే రుణ మాఫీ కాలేదని చెప్పారు. ఇది తెలుసుకునేందుకే చాలాసార్లు తిరుగాల్సి వచ్చింది. మళ్లీ అన్ని పత్రాలు ఇచ్చి రుణమాఫీకి కోసం తిరుగుతున్న. పని వదులుకుని ఇట్లా తిరుగడానికే సరిపోతున్నది.

-బాసాని ఉర్మిళ, రైతు, అమ్మనబోలు

ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

నాకు రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకుల చుట్టూ, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్న. ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంటే దానిపై బ్యాంక్ ఆఫ్ బరోడాలో 75 వేలు, గ్రామీణ బ్యాంకులో లక్షా 90వేలు రుణం పొందాను. ఏ బ్యాంకులోనూ నాకు రుణమాఫీ కాలేదు. ఇదేంటని బ్యాంకు సిబ్బందిని అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదు. వ్యవసాయాధికారులను అడిగితే రెండు బ్యాంకుల్లో రుణం తీసుకుంటే మాఫీ కాదంటున్నారు. ఒక బ్యాంకులోని రుణం మొత్తం కడితే వర్తిస్తుందని చెప్తే బ్యాంక్ ఆఫ్ బరోడాలో తీసుకున్న అప్పు వడ్డీసహా కట్టిన. ఈ విషయం వ్యవసాయ అధికారులకు తెలుపగా త్వరలో రూ.1లక్షా 90వేలు మాఫీ అవుతాయంటున్నారు. దీని కోసం ఇంకెన్ని సార్లు తిరగాలో అర్థమైతలేదు.

-గోదల వెంకట్‌రెడ్డి, రైతు, నార్కట్‌పల్లి గ్రామం

సాగునీటి కోసం ఆయకట్టు ఎదురుచూపు

సాగర్ ఎడమ కాల్వ నీటి విడుదల షెడ్యూల్ ఎప్పుడు?

నీళ్లు వదిలి మూడు వారాలు దాటినా మేజర్ల చివరికి చేరని వైనం

మరమ్మతులు లేక అధ్వానంగా మారిన కాల్వలు.. ఆందోళనలో రైతాంగం

మిర్యాలగూడ, ఆగస్టు 24 : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నీటి విడుదలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణానదికి వరద పోటెత్తడంతో సాగర్ జలాశయం నిండుకుండలా తొణికిసలాడుతున్నది. ఈ నేపథ్యంలో ఈ నెల రెండునే ఎడమ క్వాలకు నీటి విడుదలను ప్రారంభించారు. సాధారణంగా నీటి విడుదల చేసిన వారంలోపే షెడ్యూల్‌ను ప్రకటిస్తుంటారు. సీజన్ మొత్తంగా పంటల సాగుకు ఎన్ని టీఎంసీల నీటిని కేటాయిస్తారనేది పేర్కొంటారు. విడుదల నిరంతరాయంగా ఉంటుందా, వారబందీలో ఇస్తారా, ఇస్తే ఏ రోజుల్లో ఇచ్చి.. ఏయే రోజుల్లో బంద్ పెడుతారు అనే దానిపై స్పష్టత ఉంటే సాగుకు సన్నద్ధం అవుతారు. నీటి విడుదల సమయం తక్కువగా ఉంటే స్వల్పకాలిక వరి వంగడాలను నాటు వేసుకుంటారు. ఎక్కువగా ఉంటే దీర్ఘకాలిక వరి వంగడాలకు వెళ్తారు. కానీ, మూడు వారాలు దాటినా షెడ్యూల్ ప్రకటించకపోవడం గందరగోళానికి దారి తీస్తున్నది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో ఎడమ కాల్వకు 18 సార్లు నీటి విడుదల చేసింది. 9 రోజుల పాటు నీళ్లు ఇస్తూ.. ఆరు రోజుల పాటు బంద్ పెడుతూ.. ప్రణాళికాబద్ధంగా చివరి భూములకు సైతం నీరు అందించి పంటలు ఎండకుండా చూసింది.

మేజర్ కాల్వల చివరికి చేరని సాగునీరు

సాగర్ ఎడమ కాల్వ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 51 మేజర్లు ఉండగా 3,03,353 ఎకరాల ఆయకట్టు సాగు అవుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నీటి విడుదలకు ముందే మేజర్ల పరిధిలోని కాల్వలను పూడిక తీయించడంతోపాటు కట్టలపై కంపచెట్లు తొలగించేవారు. ప్రస్తుతం కాల్వలకు మరమ్మతులు చేయకపోవడంతో చివరి భూములకు సాగునీరు అందడం లేదు. నీళ్లు వదిలి 22 రోజులు దాటినా చివరి భూములకు చుక్క నీరు చేరలేదు. దాంతో పలుచోట్ల రైతులే సొంత ఖర్చులతో జేసీబీలు పెట్టి కాల్వలను శుభ్రం చేసుకుంటున్నారు. కాని నీటి విడుదల పూర్తిస్థాయిలో లేకపోవడం వల్ల చివరి భూములకు నీరందడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం, ఎన్నెస్పీ అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపంగా మారింది. ఇప్పటికైనా స్పందించి మేజర్లకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయడంతోపాటు స్వల్ప మరమ్మతులు అయినా చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాగర్ ఆయకట్టు ప్రాంతానికి చెందినవారే అయినా ఇంతవరకు నీటి విడుదల షెడ్యూల్‌పై స్పష్టత ఇవ్వకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడవిదేవులపల్లి గ్రామ పరిధిలో కంపచెట్లతో నిండి సాగునీరు అందని ముదిమాణిక్యం మేజర్ కాల్వ

పూడికతో నిండిన కిష్టాపురం మేజర్ కాల్వ

గతంలో నీటి విడుదల షెడ్యూల్ తేదీలు...

- 2018 ఆగస్టు 24
- 2019 ఆగస్టు 12
- 2020 ఆగస్టు 8
- 2021 ఆగస్టు 2
- 2022 జూలై 29

నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించాలి

ఎడమ కాల్వకు నీళ్లు విడుదల చేసి మూడు వారాలు దాటింది. ఇప్పటికీ ప్రభుత్వం ఎన్ని రోజులు నీళ్లు ఇస్తుందో చెప్పలేదు. నీటి విడుదల తేదీలను ప్రకటిస్తే ఏ రకం వరి నాటు పెట్టుకోవాలో అర్థమవుతుంది. ప్రభుత్వం ఇప్పటివరకు షెడ్యూల్ ప్రటించకపోవడంతో అయోమయంలో ఉన్నాం. ఇప్పటివరకు కాల్వ చివరి భూములకు నీళ్లే తాకలేదు. కాల్వల నిండా కంపచెట్లు పెరిగి నీరు సాఫీగా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వం మరమ్మతులు చేయించకపోవడంతో రైతులమే తలా ఇన్ని డబ్బులు వేసుకొని పొక్లేన్‌తో పూడిక తీసుంచుకున్నాం. మేజర్ కాల్వలకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసి చివరి భూములకు అందిస్తేనే వరి నాట్లు వేసుకుంటాం. ఎన్నెస్పీ అధికారులు కాల్వల వెంట తిరిగి చివరి వరకు నీళ్లు అందేలా చూడాలి.

- జానునాయక్, రైతు గూడూరు, మిర్యాలగూడ

ప్రభుత్వం స్పందించకపోతే నష్టపోతాం

ముదిమాణిక్యం మేజర్ పరిధిలో కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. పూర్తిగా కంప చెట్లు అల్లుకుపోయాయి. కట్టలపై మనుషులు కూడా నడిచే పరిస్థితి లేదు. మెట్ట పంటలకైనా నీరు వస్తుందని ఎదురుచూస్తున్నాం. అధికారులు కాల్వలను శుభ్రం చేయించి కంపచెట్లు తీయిస్తే మాకు నీళ్లు అందుతాయి. లేదంటే రైతులం తీవ్రంగా నష్టపోతాం.

-పార్లు పెద్ద మల్లయ్య (అడవిదేవులపల్లి)

చివరి భూములకు నీళ్లు వచ్చేట్లు చూడాలి

సాగర్ కాల్వకు నీళ్లిచ్చినా కిష్టాపురం మేజర్ చివరికి ఇంతవరకు నీళ్లు రాలేదు. కాల్వ మొత్తం పూడికతో నిండింది. కంప చెట్లు అంతెత్తు పెరిగినయి. నారుమడ్లు తడుపుకోవడమే కష్టంగా మారింది. కాల్వలో పూడిక తీయించి కంప చెట్లు తొలగిస్తేనే చివరి భూములకు నీరు అందుతుంది. కాల్వల ముందు భాగంలో నీటి వృధాను అరికట్టి చివరి భూములకు నీళ్లు వచ్చేట్లు చూడాలి. ఎడమ కాల్వకు నీళ్లు ఎప్పటి వరకు ఇస్తారో కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలి.

-ధర్మానాయక్, బోట్యానాయక్‌తండా, మిర్యాలగూడ